కథా నిలయం
3539
శ్రీకాకుళం



# భారత మహిళా జోహార్

చేబ్రోలు స్టేషన్లో కాకినాడ పాసింజరు ఆగినట్లే ఆగి, కూతవేసి, వెంటనే బయల్దేరింది బండి సరిగ్గా బయల్దేరుతున్న సమయానికి ఒక ఆడమనిషి, నెత్తి మీది గంపతో హడావుడిగా స్టేషన్లోంచి దూసుకుంటూ వచ్చి, ఎదురుగుండా ఉన్న మాపెట్లోకి ఎక్కేసింది. ఎక్కేముందు తన గంపను, డోర్‌లో నుంచునున్న నాకు అందించి ఎట్లాగోఅట్లా తాను లోపలికి వచ్చేసింది. మామూలప్పుడైతే ఆ అలగామనిషి గంపను నేను అందుకోక పోదును గాని, అప్పటి పరిస్థితి వేరు.

ఎక్కి స్థిమిత పడి, కిందినుంచి గంపనెత్తుకుని నావైపొకసారి విప్పారిన కళ్ళతో చూసి, కొంచెం సిగ్గుపడిపోయింది ఆమె. గంపను తీసుకుని పక్కకు నడిచి, డోర్ పక్కనే ఉన్న సింగిల్ సీట్లో కూర్చుంది.

గంపను తనసీటు కింద పెట్టుకుంది.

కృతజ్ఞతను వెలిబుచ్చటంలో, నాగరికుల 'థాంక్స్ పద్ధతి'కి అనాగరికుల 'విప్పారిత కళ్ళ పద్ధతి కి' గల వ్యత్యాసాన్ని గూర్చి ఆలోచిస్తూ డోర్‌లో నిలబడిపోయాను నేను. బండి ముందు నడిచి ఔటర్ సిగ్నల్ దాటగానే వచ్చి నాసీట్లో కూర్చున్నాను.

ఏ పక్క నుంచి వచ్చాడో గాని, నా వెనకాలే లోపలికి వచ్చాడు టి.సి. వస్తూనే ఆ ఆడమనిషి దగ్గర ఆగి, " టికెట్ !" అన్నాడు. టి.సి. స్వరం నన్ను, నా చుట్టు పక్కల వాళ్ళను తలతిప్పి అతని వైపు చూసేటట్లు చేసింది.

డోర్ కు ఈ మూలగా ఉన్న మా ఫోర్ - సీటర్ బెంచీమీద కూర్చుని ఉన్న ముగ్గుర్లోనూ నేను మధ్యవాణ్ణి. నాకూ, కిటికీకి మధ్యలో ఉన్నవాడు మా పెత్తండ్రి కొడుకు. మా ఎదుటి బెంచీ మీద ఉన్నవాళ్ళు కూడా ముగ్గురే. అక్కడున్న ప్రయాణికులందర్లోనూ, పాంటూ వగైరా వ్యవహారంతో నాగరికంగా ఉన్నవాళ్ళు నేనూ, మా వాడు మాత్రమే.

టి.సి. మాటల్లోని కర్కశత్వానికి నేను కొంచెం నొచ్చుకున్నాను. ఆ ఆడమనిషి మాత్రం బెదిరింది. ఆ మనిషి కిటికీ వైపు కొంచెం ఒదిగి, టి.సి. వైపు చూస్తూ, " టిక్కట్టా, బాబూ ?" అంది. మెల్లిగా కొంగు ముడి విప్పటం మొదలు పెట్టింది. నేనామనిషిని ఇప్పుడు పరిశీలనగా చూశాను. ఒంటికి రవికె లేదు. ఏదో చవకరకం ముతకచీరె కట్టుకోనుంది. సన్నగా బక్కపల్చగా ఎర్రగా ఉంది. ముక్కుకూ చెవులకూ లావుపాటి బంగారపు రింగులున్నాయి. కాళ్ళకు పాతకాలపు వెండి కడియాలున్నాయి. మనిషి వయస్సు నలభై, యాభై మధ్య ఉండవచ్చు.

ఆమె కొంగు ముడిలో టిక్కెట్టు అంచులు చూసిన టి.సి. ముందుకు నడిచి మాబెంచీల్లో చెక్కింగు ప్రారంభించాడు మా ఎదుటి ముగ్గుర్నీ చూసి మా తమ్ముడి దగ్గరకు వచ్చేటప్పటికి వాడు తన పాస్ చూపించాడు. టి.సి. దాన్నొక మాటు లక్ష్యం లేనట్లు చూసి, "ఆ సంతకం లేదు చెల్లదు !" అన్నాడు అతి కర్కశంగా. " ఉంది." అన్నాడు తాపీగా మావాడు.

టి.సి మళ్ళీ చూశాడు. తను పొరపడినట్లు గ్రహించినట్లున్నాడు. "సారీ, సారీ" అని మెత్తని స్వరంతో అంటూ పాస్ ను మా వాడికిచ్చేసి నావైపు కదిలాడు. ఈ చిన్న సంఘటన నామనస్సులో ఆ టి.సి పట్ల ఒక రేఖామాత్రపు చులకన భావాన్ని అంకురింప జేసింది. " ప్రభుత్వోద్యోగి అన్నవాడెవడైనా తన బాధ్యతను నిర్వర్తించడానికి కర్కశంగా ఉండటం అవసరమా ?" అన్న ప్రశ్న నాలో ఉదయించింది.

టి.సి. నాదీ నాపక్కతనది టిక్కెట్లు చెక్‌చేశాడు. మా వరుసలోని సింగిల్ సీటు ఖాళీగా ఉండటం చేత, మా వెనకాల వరస వైపు వెళ్ళబోయాడు. రైలు వేగం బాగా పుంజుకుంది

★ ★ ★

'కురుకురు కురుకురు కురుకురు కొక్కొరొకో!' - హటాత్తుగా వినిపించిన ఈ శబ్దానికి టి.సి. టక్కున ఆగిపోయాడు వెనక్కు తిరిగాడు. మేమందరమూ కూడా శబ్దం వచ్చిన వైపుకు చూశాము. ఆ ఆడమనిషి సీటు కింద గంపమీద గుడ్డ తాలూకు అంచును తోసేసి, మెడ బయట పెట్టి, నిక్కుతూ చూస్తోంది ఒక కోడి పుంజు!

టి.సి. గబగబా ఆ వైపుకు నడిచాడు. " ఈ కోడి పుంజుఎవరిది?" అన్నాడు గంభీరంగా. ఆ ఆడమనిషి బెదురు స్వరంతో " నాదే బాబూ", అంది " అయితే లగేజి టిక్కెట్టేది ?"

" టిక్కెట్టా బాబూ ఇదుగో !" తన గుప్పెట్లో పట్టుకోనున్న టికెట్‌ను ఆమె చూపించింది. టి.సి. దాన్ని తీసుకుని చూశాడు. నువ్వెళ్ళేది తాడేపల్లిగూడెమా ?" " అవునుబాబూ" టి.సి. టికెట్‌ను ఆమెకిచ్చివేస్తూ, " సరే, నీ టికెట్ చూపించావు కోడిపుంజుకు టికెట్ ఏది?" అన్నాడు.

అసలే అమాయకంగా ఉన్న ఆ మనిషి మొఖంలో మరింత అమాయకత్వం, ఆశ్చర్యం చోటు చేసుకున్నాయి. కొన్ని క్షణాలు టి.సి. మొహంలోకి చూసి నెమ్మదిగా అంది, " కోడిపుంజుకు తిక్కెట్టున్నాదా బాబూ?" " ఏం ఎందుకుండదు? తిండి తినే ప్రతి వస్తువుకూ ఉంటుంది. నీకూ లేదు, అట్లాగే దానికీనూ!... తియ్, టికెట్ తియ్!"

" నాకాడెక్కడున్నాది బాబూ, నాను తియ్‌నేదే!"..." తియ్యలేదూ, ఎందుకు తియ్యలేదు? రైలు పెట్టె నీమొగుడు సొమ్మనుకున్నావా, నీతాత సొమ్మనుకున్నావా?"... "కోడిపుంజుకి టిక్కట్టున్నాదని నాకెరికనేదు బాబూ!" " నీకు పిల్లలెంతమంది?" " నాకా బాబూ, పుంజీడు బాబూ!" " మరింకేం, నలుగురు పిల్లల్ని కన్నదానివి కోడిపుంజుకు టికెట్ తీసుకోవాలని తెలీదూ?" - ఈ మాటలని, టి.సి. వెనక్కు తిరిగాడు. మా అందరి వంకా చూసి నవ్వాడు. బహుశా తన మాటల్లో తాను ఉందని అనుకుంటున్న హాస్యాన్ని మేము ఆస్వాదించి తనను బలపరుస్తామన్న భావన అయి ఉండవచ్చు కానీ.... ఎవ్వరమూ నవ్వలేదు.

నాకు ఈ సంభాషణ చిరాకును కలిగిస్తోంది. ఆమెకు పక్కగా, ఫోర్-సీటర్ బెంచీగోడకు అనుకుని నుంచునున్న టి.సి. ఆమె వైపు తిరిగి," ఏదీ, ఆ గుడ్డెత్తు, ఇంకా ఎన్ని కోళ్ళున్నాయో చూద్దాం." అన్నాడు. ఒక్క క్షణం సేపు టి.సి. మొహంలోకి అయోమయంగా చూసింది ఆమె, చివరకు వంగి గంపను ఇవతలికి లాగి, పై గుడ్డను తొలగించింది. అందులో ఉన్న కోడి ఒక్కటే. దాని కాళ్ళు కట్టివేయబడి ఉన్నాయి. అది ఇంకా నిక్కి నిక్కి చూస్తోంది.

ఆమె అంది. " ఇదిగిదేటి చూడుబాబూ, నా నబద్దమాడ్నేదు" అని కోడి అల్లరి చెయ్యకుండా కాబోలు, వెంటనే గంపమీద గుడ్డ కప్పేసి గంపను సీటుకిందికి తోసేసింది.

"ఒకటే వుంది బతికి పోయావ్. దాని పిల్లలు కూడా ఉంటే తలకో టిక్కెట్టూ కొనాల్సి వచ్చేది."

"కోడిబొట్టే క్కూడా తిక్కెట్టు తియ్యాలా బాబూ?" అని రెండుక్షణాలాగి, మరయితే "గుడ్డుకేటంటావు?" అంది ఆమె. నాకు మాత్రం ఆమె మొహంలో అమాయకత్వమే కనిపించింది.

టి.సి.మొహంలో కోపం వ్యక్తమయింది. " ఏమిటీ గుడ్డుకా! వేళాకోళంగా ఉందా ?"

" ఏలాకోలం ఏట్నేదు బాబూ, నాకెరికనేకడూతన్నాను " "అడుగుతావ్, అడుగుతావ్! సరే, నీతో నాకేమిటి గాని, నీ పేరు చెప్పు" అంటూ ముందుకు వంగి జేబులోంచి రసీదు పుస్తకమూ పెన్నూ

తీశాడు టి.సి.

" దమయంతి బాబూ. ఎందుకు బాబూ ?" " ఎందుకేమిటి, గవర్నమెంటుకు నువ్వు ఎగ్గొడదామనుకున్న సొమ్ము నీచేత కట్టించటానికి." కళ్ళుమూసుకుని, పెన్సిల్‌ని నుదురు నొక్కుకుని, పది క్షణాల తరవాత, " ఐదురూపాయలు కట్టాలి" అన్నాడు.

దమయంతి నుంచుంది. అంది " ఏటి బాబూ?"... " ఏమిటా, నువ్వు కట్టవలసిన జుల్మానా ఐదురూపాయలు. తియ్, డబ్బు తియ్," ఇట్లా అంటూ చెయ్యి చాపి వేళ్ళు ఆడించాడు టి.సి. దమయంతి మొహంలో కంగారూ భయమూ తలెత్తాయి. ఇంచుమించు ఏడుపు స్వరంతో ఆమె అంది. " నాను జులమానం కట్టడమేటి బాబూ ! నాకేటెరికనేదు బాబూ! నన్నొగ్గేయ్ బాబూ !" ..." ఒదిలెయ్యటమా! నాది ఉద్యోగమనుకున్నావా ఊళ్ళేలటమనుకున్నావా, నిన్నొదలటానికి! దొంగమాటలు చెప్పక తియ్, తియ్, డబ్బు తియ్ . ఐదు రూపాయలు."

" దొంగమాట్లు కావు బాబూ సత్తెంగా నాకేటిరికనేదు బాబూ! ఎరికుంతే కోడిపుంజు తీసుకొస్తనేటి? నానెప్పుడు పుంజుతో పెట్టెక్కనేదుబాబూ ! ఈ పాటికి నన్నొగ్గెయ్ బాబూ!" ..." ఇట్లా ఏడిస్తే ఏం లాభం లేదు. నువ్వు తెలియక చేసినా తప్పు తప్పే. నువ్వు డబ్బు కట్టక తప్పదు. కడతావా. కట్టవా. చెప్పు."... " హో లమ్మో నాకేటీ తంటసవుబాబూ!" దమయంతి నోటికి కొంగు అడ్డం పెట్టుకుని సన్నసన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

ఈ దృశ్యాన్ని మా ఆరుగురమూ చూస్తూన్నప్పటికీ, అది మరి బలహీనతో ఏమోగాని, కల్పించుకోవాలని బుద్ధిపుట్టింది నాకుమాత్రమే. నా సీట్లోనే ముందుకు వంగి దయమంతితో అన్నాను. " గవర్నమెంటు రూల్సు ప్రకారం నువ్వు చేసింది తప్పు. కనక డబ్బు కట్టక తప్పదు."

సన్నగా ఏడుస్తూనే ఆమె నా వైపు తిరిగి అంది " సత్తెంగా కట్టాల్సిందేనా బాబూ?" అంది. " ఆహా కట్టాల్సిందే!" అన్నాన్నేను. టి.సి. వెంటనే అందుకున్నాడు. " అదుగో చూశావా! నువ్వెవర్నడిగినా నామాటే చెబుతారు. మరింక గొడవ చెయ్యక ఐదు రూపాయలూ తియ్."

దమయంతి ఏడుపు మానేసింది.మాఇద్దరి వైపూ మార్చి మార్చి చూసి, తలవంచుకుని, మెల్లిగా కొంగుముడి విప్పింది. అందులో కొద్దిగా చిల్లర ఉంది. చిల్లర లెక్క పెట్టి అంది. " నాకాడ రూపాయే ఉంది. అయిదునేవు." టి.సి. ఉగ్రుడైపోయాడు. " రూపాయి చూపించి డబ్బుల్లేవని నాటక మాడదామనుకుంటున్నావు కాబోలు. ఇంకా నయం, నెత్తిన బొచ్చు చూపించి నీ దగ్గిర అదే ఉందన్నావు కాదు... తోలు తీయించేగల్ను. తియ్, తియ్."

దమయంతి కంఠంలో తగ్గిన దుఃఖం హటాత్తుగా పైకి పెల్లుబికింది." అట్టాంటి మాట్లు అనొద్దు బాబూ నాను పెద్దముండను కదా! నీకిదేటి న్యాయం? నాకాడ పైసలుంతె సూపిస్తను కానా? నాకాడ ఇయ్యే ఉన్నయ్.. నాను సంకురేత్తిరి పండక్కి గుడాం ఎల్తన్నాను బాబూ. స్టేషను కాడికి మా అల్లుడొచ్చేస్తాడు. నన్ను నువ్వొగ్గేపోతే నాకు చిన్నతనవయిపోతది. జులమానం ఇసయవేటో నాకెరికనేదు. ఈ డబ్బుచ్చుగుంతను ఇదట్టుగొని నన్నొగ్గెయ్, బాబూ!"

" ఏమిటీ ఐదు రూపాయలకు రూపాయిచ్చి వదిలించుదామనుకుంటున్నావా? ఎవడి సొమ్మనుకున్నావే ! ఇదిగో, ఆఖరుసారి చెప్తున్నాను - మర్యాదగా ఐదు రూపాయలూ కట్టావా సరే లేకపోతే గూడెంలో పోలీసుల్ని పిలిపించి నిన్ను అరెస్టు చేయిస్తాను. నీ కాళ్ళకూ ముక్కుకూ ఉన్నవన్నీ తీసి తెగనమ్మి, వాళ్ళు నీచేత డబ్బు కట్టిస్తారు. ఆ తరువాత నీఇష్టం!"

దమయంతి టి.సి. వైపు గుచ్చి గుచ్చి చూసింది. హటాత్తుగా ఏడుపు ముంచుకు రాగా టి.సి

కాళ్ళ మీద పడిపోయి భోరున ఏడ్చేస్తూ మధ్యలో అంది. '' బాబ్బాబూ, నీకు దరమం కాదు బాబూ! నన్ను రక్షించు బాబూ! పెద్దముండను, జైల్లో కెల్లడమేటి బాబూ! నాకాడ సత్తెంగా రూపాయే ఉంది. ఇదట్టుగొని నన్నొగ్గేయ్ బాబూ ! సచ్చి నీకు పుడతాను బాబూ !''

నేనాదృశ్యాన్ని ఇంక చూడలేక పోయాను. నా చుట్టుపక్కల వాళ్ళు కూడా అసహనంగానే ఉన్నట్లు వాళ్ళ మొహాలే చెప్తున్నాయ్. నేను లేచి రెండడుగులు వేసి టి.సి. భుజం మీద చెయ్యివేస్తూ అన్నాను. '' డబ్బుల్లేవంటూంది కదా. ఇంక ఎంత అడిగితే ఏం లాభం? కావాలంటే ఆ రూపాయి పుచ్చుకోండి. లేకపోతే ఊరికే వదిలెయ్యండి.'' టి.సి. కోపం నావైపు ప్రవహించింది. '' ఏమిటీ మీరనేది! వదిలెయ్యమంటున్నారా! మీరిట్లాగే మీ ఉద్యోగం చేస్తున్నారా ? మీ ఉద్యోగం ఏమిటి?''

నేను తెల్లబోయాను! టి.సి. నానోటిని గెలిచాడు, కాని, నా హృదయాన్ని పోగొట్టుకున్నాడు! నేనేం మాట్లాడకుండా వెనక్కు నడిచి నా సీట్లోకి జారాను. టి.సి. కాళ్ళమీద పడి ఏడుస్తున్న దమయంతి నుంచొని అతని చేతులు పట్టుకుని బతిమాలటం మొదలుపెట్టింది.

టి.సి. నెమ్మదిగా వెనక్కు అడుగులు వేసుకుంటూ రెండుడోర్ల మధ్య ఉన్న వరండాలోకి జరిగాడు. దమయంతి అతన్ననుసరించింది. టి.సి. ఏం మాట్లాడాడో నాకు వినిపించలేదు. కాని, '' వోలమ్మో, మూడు రూపాయలే అని దమయంతి అనటం మాత్రం వినిపించింది. ఏదో గొనుక్కుంటూ టి.సి. తిరిగి వచ్చి తన పాత స్థానం దగ్గర బెంచీమీద కూర్చున్నాడు దమయంతి సీటుకు పక్కగా.

దమయంతి కూడా తన సీట్లో కొచ్చికూర్చుంది. ఇంకా బతిమాలుతూనే అతని చేతులు పట్టుకుంది. టి.సి. '' ఛీ, నోర్ముయ్!'' అంటూ తన చేతులు విడిపించుకున్నాడు.

దమయంతి క్రమంగా ఏడుపు మానేసింది. మొహం తీక్షణమైంది. రెండు మూడు నిముషాల తరవాత అంది. '' ఏటి బాబూ, ఈయన్యాయవు? నువ్వడుగుతాన్న డబ్బిస్తే ఒగ్గేస్తవు? నాకపోతే బట్టుగుని జైల్లో తోయించేస్తవు? ఇదేటి దాష్టికవు బాబూ?''

టి.సి. మొహం మళ్ళీ కోపం పులుముకుంది.'' దగుల్బాజీ మాటలు మాట్లాడకు. డబ్బిస్తానన్నది నువ్వు. లంచం ఇస్తానన్నావు గనక జుల్మానా పెరుగుతుంది ఇప్పుడు నువు పది రూపాయలు కట్టాలి. ''
'' ఏటీ, జులమానం పెరిగినాదా ? పెరగనీ బాబూ, పెరగనీ! నాజులమానం పెంచుతున్నావు, నీ యన్నాయం పెంచుతున్నావు. నివ్వు వో యమ్మకీ అబ్బకీ పుట్టినావు కావు గావాల! అప్పుడింక పెరక్క ఏటవుతాది?''

నాకు విషయమంతా అర్థమైపోయింది. టి.సి. ఉగ్రుడైపోయాడు. కళ్ళు చింతనిప్పులయ్యాయి, చుట్టూ మావైపొకసారి చూశాడు. వెంటనే ఆమెతో అన్నాడు.'' నోటికొచ్చినట్టు వాగకు. గవర్నమెంటు ఉద్యోగిని అవమానిస్తున్నావు నువ్వు ! సెక్షను నూట ఇరవై ఒకటి కింది జుల్మానా ముప్పై కట్టాలి నువ్విప్పుడు.''

'' ముప్పయ్యా! పుంజీడొందలడుగు బాబూ. పుంజీడొందలడుగు. ఈ ముదనష్టపు కోడి న్నాను మూడు రూపాయలక్కొన్నాను. నీకు ముప్పయి జులమానం అచ్చుగుంతను. వోడు బాబు నీకు నౌకరి ఇచ్చినాది?''

టి.సి. మాట్లాడలేదు మొహం మాత్రం కోపాన్ని కక్కుతూంది బహుశా, గూడెం వెళ్ళే దాకా దమయంతికా కసి, అక్కడ స్టేషన్లో ప్రతీకారం చేసే ఆలోచన్లో అతను ఉండి ఉండవచ్చు.

ఈ హడావుడిలో ఉంగుటూరు స్టేషను ఎప్పుడు వెళ్ళిపోయిందో నేను గమనించలేదు. ఇప్పుడు మాత్రం బండి బాదంపూడి స్టేషన్ను వదలటాన్ని గమనించాను. కొన్ని క్షణాల్లోనే బండి వేగం అందుకుంది.

ఉండి ఉండి దమయంతి హటాత్తుగా ముందుకు వంగి, తన గంపను బయటికి లాగింది కోడిని బయటికి తీసింది. దానికాళ్ళకు కట్టిన తాడు విప్పి అది తన చేతుల్లో గిలాగిలా తన్నుకుంటూండగా, నుంచుంది. నుంచున్న మనిషి ముందుకు వంగి, టి.సి. మొహంలో మొహం పెట్టి అంది.

" నాను కోడికి తిక్కట్టు తియ్యనేదని గదా నువ్వు నాకు జులమానం ఏసినవు! నన్నుసురు బెట్టేసి నవు! కోడినాకపోతే తిక్కట్టు అవసరమేటున్నాది?"

- ఇట్లా అంటూగిరుక్కున కిటికీలోంచి కోడిని బయటకు పట్టుకుని దాన్ని వెనక్కూ ముందుకూ రెండుసార్లు ఊపి, గాల్లోకి, పైకి ఒక్కసారిగా ఎగురవేసింది! 'కురుకురు కురుకురు' అన్న శబ్దం పావు క్షణం సేపు లీలగా వినిపించి రైలు శబ్దంలో కలిసిపోయింది. కోడి మాయమైపోయింది.

టి.సి. చటుక్కున తన సీట్లో నుంచి లేచాడు. డోర్ దగ్గిరకు వెళ్ళి కోడి కోసం బయటకు చూశాడు. వెంటనే దమయంతి వైపు కోపంగా చూశాడు. మళ్ళీ బయటకు చూశాడు. బండి వేగంలో కోడి అతనికి కనిపించిందో, లేదో అతనికే తెలియాలి! వెలాతెలా పోయిన ముఖంతో వెనక్కు వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. నేను నిశ్చేష్టుడనయ్యాను, నా ముందు కూర్చున్న వాళ్ళల్లో ఇద్దరు పకపకా నవ్వారు.

★ ★ ★

బండి తాడేపల్లి గూడెం సమీపిస్తూంది. దమయంతి నడుముకు చేతులు బిగించి, టి.సి. మొహంలోకి చూస్తూ అంది " ఉప్పుడు చెప్పు బాబూ, నాను జులమానం ఎందుకియ్యాల? చెప్పు బాబూ, ఉప్పుడు చెప్పు!" టి.సి. ఆమె వంక ఉరుముతూ చూశాడు. " ఏమీ కట్టక్కరలేదులే ఫో!" అంటూ అక్కడ్నుంచి లేచి, పెట్టెలో రెండో భాగం వైపు వెళ్ళబోయాడు.

దమయంతి హటాత్తుగా అతని అడ్డం వచ్చి " మరయితే ఈ తలికి నన్నగ్గి మీదెట్టేసినావెందుకు బాబూ! నాను దగుల్బాజీదాన్నా? లంచవిస్తనన్నానా? నా బుఱ్ఱమీదెంట్రికల ఇసయం నీకేటి? నాసంతు ఇసయం నీకేటి? ఈ బాబు అందరూ సాచ్చీకవే. చెప్పు బాబూ."

బండి మోడరన్ రైస్ మిల్లు దాటేసి, ఫ్లాట్‌ఫారాన్ని అందుకుంది.ఆగుతోంది.

టి.సి. ఆమె వంక మిర్రి మిర్రి చూవాడు. గిరుక్కున వెనక్కు తిరిగి ఆమె సీటుకు ఒక మూలగా ఉన్న డోర్ దగ్గిరకు వెళ్ళబోతూ మలుపు తిరిగాడు.

దమయంతి అంతకన్నా చురుగ్గా ముందుకు నడిచింది.టి.సి.ని తోసుకుంటూ గబగబా వెళ్ళి ఆ డోర్‌లోనే అడ్డంగా నిలబడింది. పరిస్థితి నాకు అర్థమైంది. ఒక వ్యక్తి , అందులోనూ ఒంటరిది, అన్యాయానికి గురయినప్పుడు ఏమీ పట్టనట్టుగా ఊరుకోవటం నాకిష్టంలేదు. మంచివాణ్ణనిపించుకోవటం నాకిష్టమే కాని, న్యాయాన్ని సహిస్తూ ఊరుకోగల మంచితనాన్ని మాత్రం నేను కోరుకోను. ఈ కారణంగానే నేను మా తమ్ముడికి కన్నుగీటాను. ఇద్దరం లేచి వచ్చి, టి.సి.కి అడ్డంగా అతను ఇవతలివైపు డోర్‌లో నుంచి దిగిపోకుండా ఏమీ తెలియనట్లుగా నుంచున్నాము. ఈ లేవటాలు, నుంచోవటాలూ అన్ని క్షణాలమీద జరిగిపోయాయి. టి.సి. మా అందరివైపు తినేసేటట్లు చూస్తున్నాడు.

బండి ప్లాట్‌ఫారం మీద ఆగింది. దమయంతి, ఫ్లాట్‌ఫారం మీద దూరంగా ఉన్న ఎవణ్ణో చూసి, " ఓరోరి, ఓరప్పిగా, నా(నా నాను!" అని కేకేసింది.

కాకీ నిక్కరు, గళ్ళ చొక్కా, పొట్టేలు కొమ్ముల క్రాపింగు, జొన్న పొత్తుల పీచు మీసాలు, ఎఱ్ఱ కళ్ళు- ఈ అవతారంలో ఉన్న పాతికేళ్ళ వాడొకడు దమయంతి పిలుపు అందుకుని ఇటువైపు చూశాడు.టి.సి. వాణ్ణీ చూశాడు. తటాల్న దమయంతిని తోసుకుని కిందికి దిగాడు. కిందికి వెళ్ళబోయాడు దమయంతి

చటుక్కున కిందికి దూకింది అతని కోటు పట్టుకుంది "ఏటి బాబూ, పారిపోతన్నవా? ఆగాగు. మా అల్లు డొస్తన్నడు" మేమిద్దరం కూడా కిందికి దిగాము టి.సి కి చెరోఒక వైపునా చేరాము.

టి సి మొహాన కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు చటుక్కున కోటు జేబులోంచి రెండు రూపాయల నోటు తీసి దమయంతి చేతిలో పెట్టాడు. "కోడి ఖరీదు తీసుకో" అంటూ విడిపించుకుని వెళ్ళబోయాడు.

దమయంతి, నోటు పట్టుకుంది. కాని, కోటు వదల్లేదు చేతిలోని నోటు వంకచూస్తూ అంది. "నాకు లంచవిస్తన్నవా, బాబూ?" ప్లాట్‌ఫారం మీద ఖాళీగా నుంచోనున్న నలుగురు అప్పుడే మా దగ్గిరకు వచ్చారు. గళ్ళచొక్కా వాడు కూడా వచ్చాడు.టి.సి. మళ్ళీ పెనుగులాడాడు. దమయంతి వదల్లేదు. దమయంతి తన అల్లుడి వైపు తిరిగి అంది. "ఓరప్పిగా! నీ సారాకొట్టు మణుసుల్ని తీసుకొస్తవేట్రా? - ఈ చెక్కింగు బాబు పారెల్లిపోకుండా బేగి టేషనుబాబు కాడికి తీసికెళ్ళిపోవాల... అసలేటయినా దెరికా ? నాకాడ తిక్కటున్నాదిగాదా, నాను రొండు తిక్కట్లు ఈ బాబుకి చూపిచ్చాలంట! నాకపోతే మూడు రూపాయలు లంచవియ్యాలంట. అదుగో ఆ బాబుల్ని సాచ్చీకం అడుగు. చెప్పుతారు." ఇట్లా అంటూ దమయంతి మా ఇద్దరి వైపు చెయ్యి చూపించింది.

ఈ అరుపులకి చుట్టు జనం సమృద్ధిగా మూగారు. దమయంతి ఉద్వేగంతో రొప్పుతూ నాలుగైదు క్షణాలు ఆగింది. టి.సి. మళ్ళీ విడిపించుకోబోయాడు. ఇంకా గట్టిగా అతని కోటును పట్టేసింది. దమయంతి అతనితో అంది. "నాయం ఉండాల బాబూ, నాయం ఉండాల! నువ్వు సదుకున్నోడివి నాను సదూలేన్దాన్ని. కానయితే నీకూ నాకూ పానం ఒకటే. మానవూ ఒకటే. ఆడకూతురు నన్నట్టుగొని మా చెడ్డ మాటలనీసినవు. నీకు నోరెట్టాగొచ్చినాది బాబూ? గవురువంటోల్లంత ఇట్టాగే జులువు చేస్తే మావెట్టా బతుకుతాము బాబూ? పెపంచక మేటయిపోతది బాబూ?

"నీ కోటు నానేసుకొని, లంచమియ్యమని నిన్నూదరగొట్టేత్తే నువ్వేటయిపోతవో ఆలోచిచ్చు బాబూ! తప్పు బాబూ తప్పు! ఉసురు బెట్టకూడదు. సదూకున్నోళ్ళు నాయవేటో సేసి చూపిచ్చాల. నేక పోతే దొరికనకాడికుచ్చుగొని సంతోషిచ్చాల."

దమయంతి మళ్ళీ ఆగి ఊపిరి తీసుకుంది. మాటల్లో ఉద్వేగం తగ్గగా నెమ్మదిగా అంది. "ఈ రెండు రూపాయలు నువ్వుంచేసుకో. కోడి నొగ్గేసి నాను గవర్నమెంటు ఋణం తీర్చేసుగున్నను గానా! ఇంక నీఋణం నాకెంతుకు? ఊఁ. ఊఁ ఎల్లు బాబూ, ఎల్లెల్లు !"

దమయంతి ఆ రెండు రూపాయల నోటును టి సి.జేబులో పెట్టి కోటును వదిలేసింది.

టి.సి. ఆమెకు చుట్టూ మూగి చోద్యం చూస్తున్న సుమారు పాతికమంది జనాన్ని మిర్రి మిర్రి చూసుకుంటూ ఇందర్నీ తోసుకుంటూ అక్కడ్నుంచి కదిలాడు. రెండో క్షణంలో ఎటో మాయ మయ్యాడు.ఇంతసేపూ నిశ్చేష్టులమై ఉన్న మేమిద్దరం రైలు కూతతో ఈ లోకంలోకి వచ్చిగబగబా పెట్టె ఎక్కాము.

టి.సి. ని కాలరు పట్టుకుని నిలదీసే స్థితికి దమయంతి హటాత్తుగా ఎదిగిపోయినందుకే చిత్తైపోతున్నాన్నేను, తన చేతిలో కొచ్చిన రెండు రూపాయల్ని అవలీలగా తిరగ్గొట్టేసి, "నీ ఋణం నాకెంతుకు?" అన్న ఆమె మాటలకు ఇంకా రెట్టింపుగా చిత్తైపోయాను.

"భారత మహిళా జోహార్!" అన్న మాటలు నా గొంతుకలో పుట్టి గురగురలాడాయి. అవి బయటకు రాకుండా మాత్రం జాగ్రత్త పడగలిగాను.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 22-3-1978)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★